# Visit of National Security Advisor to Washington DC (January 30-February 01, 2023)

February 01, 2023

# వాషింగ్టన్ డీసీలో జాతీయ భద్రతా సలహాదారు పర్యటన (జనవరి 30 – ఫిబ్రవరి 01, 2023)

ఫిబ్రవరి 01, 2023

జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) శ్రీ అజిత్ దోవల్ 2023 జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1 మధ్య వాషింగ్టన్ డీసీలో అధికారికంగా పర్యటిస్తున్నారు. ఆయనతో పాటు భారత ప్రభుత్వ సీనియర్ అధికారులు, అలాగే భారతీయ పరిశ్రమ దిగ్గజాలు కూడా ఉన్నారు.

పర్యటన సందర్భంగా అమెరికా ప్రభుత్వం, కాంగ్రెస్‌లోని విధాన నిర్ణేతలు, సంబంధితవర్గాలతో పాటు వ్యాపార, విద్య, పరిశోధన వర్గాలతో ఎన్ఎస్ఏ సమావేశమయ్యారు. ఇరు దేశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్న పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాల గురించి చర్చించారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్‌తో భేటీతో పాటు ఆయన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ మార్క్ మిలీ, తాత్కాలిక రక్షణ శాఖ మంత్రి కాథలీన్ హిక్స్, కీలక సెనేటర్లు, పరిశ్రమ దిగ్గజాలతో కూడా సమావేశమయ్యారు. పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో కూడా సమావేశమవుతారు.

ఎన్ఎస్ఏ సలివాన్‌తో కలిసి ఎన్ఎస్ఏ దోవల్ 2023 జనవరి 31న వైట్‌హౌస్‌లో క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ (ఐసీఈటీ)పై ప్రారంభ సమావేశానికి సహాధ్యక్షత వహించారు. తద్వారా 2022 మే నెలలో టోక్యోలో జరిగిన సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మరియు అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ బైడెన్ చేసిన ప్రకటనకు కార్యరూపమిచ్చారు. ఐసీఐటీ ఆవిష్కరణ కార్యక్రమంలో అమెరికాలో భారత రాయబారి, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్, టెలికం శాఖ కార్యదర్శి, ఇస్రో ఛైర్మన్, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ మరియు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ అలాగే కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖకు సంబంధించిన పలువురు సీనియర్ అధికారులు కూడా ఎన్ఎస్ఏతో కలిసి పాల్గొన్నారు. అమెరికా తరఫున పాల్గొన్న వారిలో నాసా అడ్మినిస్ట్రేటర్, నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) డైరెక్టర్, డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారు తదితరులు ఉన్నారు.

సాంకేతిక వేల్యూ చెయిన్స్ నెలకొల్పడం మరియు ఉత్పాదనల సహ-అభివృద్ధి, సహ-ఉత్పత్తిలో సహకరించుకోవడం ద్వారా ఇరు దేశాలు విశ్వసనీయ సాంకేతిక భాగస్వాములుగా ఎదిగేందుకు ఐసీఈటీ తోడ్పాటు అందించనుంది. స్టాండింగ్ మెకానిజం ద్వారా నియంత్రణలపరమైన ఆంక్షలు, ఎగుమతులపై నియంత్రణలు మరియు మొబిలిటీలో అడ్డంకులను పరిష్కరించాలని ఇది లక్ష్యంగా నిర్దేశించుకుంది. చట్టాల్లో మార్పులు చేసే దిశగా ప్రయత్నించడంతో సహా కొన్ని కీలక విభాగాల్లో భారత్‌కు ఎగుమతులపరంగా ఉన్న అడ్డంకులను సడలించేందుకు కృషి చేస్తామని అమెరికా హామీ ఇచ్చింది. స్టార్టప్ వ్యవస్థల మధ్య సంబంధాలను పటిష్టపరచడం మరియు ఎక్స్‌పోలు, హ్యాకథాన్‌లు, పిచింగ్ సెషన్స్ ద్వారా ఇరు దేశాల్లోని కీలక రంగాల్లో నవకల్పనలకు సంబంధించిన వారధులను నిర్మించడం వంటి అంశాలపై ఈ సందర్భంగా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

క్వాంటమ్ టెక్నాలజీస్ ప్రాధాన్యతను గుర్తిస్తూ పరిశ్రమ మరియు విద్యావేత్తల భాగస్వామ్యంతో ఇరు దేశాలు ఒక క్వాంటమ్ కోఆర్డినేషన్ యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాయి. సెమీకండక్టర్ల విభాగంలో భారత్‌లో ఫ్యాబ్రికేషన్ వ్యవస్థ అభివృద్ధికి అమెరికా తోడ్పడింది. అలాగే అధునాతన సాంకేతిక నోడ్స్ మరియు అధునాతన ప్యాకేజింగ్ అంశాల్లో జాయింట్ వెంచర్లు మరియు భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించింది. సమీప భవిష్యత్తులోని అవకాశాలను గుర్తించేందుకు అలాగే దీర్ఘకాలిక సెమీకండక్టర్ వ్యవస్థలను అభివృద్ధి చేసే విషయాల్లో "సన్నద్ధతను మదింపు చేయడం" కోసం భారత్‌కు చెందిన సెమీకండక్టర్ మిషన్, ఇండియా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) మరియు అమెరికా సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ)లతో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు ఒక నిర్ణయానికి వచ్చాయి.

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి సంబంధించి పరస్పర ప్రయోజనాలు ఇమిడి ఉన్న కీలక ఉత్పాదనలను సంయుక్తంగా తయారు చేయడంపై దృష్టి పెట్టాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. దేశీయంగా తయారయ్యే తేలికపాటి యుద్ధ విమానం కోసం భారత్‌లో జెట్ ఇంజిన్లను ఉత్పత్తి చేసేందుకు M/s జనరల్ ఎలక్ట్రిక్ చేసుకున్న లైసెన్సు దరఖాస్తు సమీక్షను వేగవంతం చేస్తామని అమెరికా హామీ ఇచ్చింది. ఇరు దేశాల్లోని రక్షణ రంగ స్టార్టప్‌లను అనుసంధానించేందుకు కొత్తగా నవకల్పనల వారధిని ఏర్పాటు చేయనున్నారు.

అంతరిక్ష రంగానికి సంబంధించి భారతీయ అంతరిక్ష రంగ సరళీకరణతో అవకాశాలు అందుబాటులోకి రావడాన్ని మరియు అమెరికాకు భారత స్పేస్ టెక్నాలజీ కంపెనీల తోడ్పాటును ఈ సందర్భంగా ప్రశంసించారు. మానవ సహిత విమానాలను అంతరిక్షంలోకి పంపే అవకాశాలు, నాసాకు చెందిన

కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్ (సీఎల్‌పీఎస్) ప్రాజెక్ట్, స్టెమ్ (STEM) ప్రతిభావంతుల మార్పిడి వంటి అంశాల్లో నాసాతో ఇస్రో కలిసి పని చేయాలని నిర్ణయించారు.

తదుపరి తరం టెలికమ్యూనికేషన్స్ విషయంలో వ్యయాలు, విస్తృతిపరంగా పోటీపడటంలో భారత్‌కు ఉన్న సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని విశ్వసనీయ వనరులను వినియోగించుకుని 5జీ/6జీ మరియు ఓరాన్ (ORAN)పై ప్రభుత్వ-ప్రైవేట్ రంగ సమాలోచనలు ప్రారంభించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి.

ఐసీఈటీ ఆవిష్కరణ సందర్భంగా భారత శాస్త్ర, సాంకేతిక విభాగం మరియు అమెరికా నేషనల్ సైన్స్ ఫౌండేషన్ మధ్య కొత్తగా అమలు ఒడంబడికపై రాయబారి మరియు ఎన్ఎస్ఎఫ్ డైరెక్టర్ సంతకాలు చేశారు. సీఈటీలో సంయుక్త పరిశోధనకు కూడా ఇది వర్తించనుంది.

2023 జనవరి 30న అమెరికా మరియు భారతీయ పరిశ్రమ వర్గాలతో యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఐసీఈటీ రౌండ్‌టేబుల్ నిర్వహించారు. ప్రభుత్వం, పరిశ్రమ, మరియు విద్యావేత్తల మధ్య అధునాతన సాంకేతిక భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకునేందుకు ఉపయోగపడే ఆలోచనలను పంచుకునేందుకు ఇదొక చక్కని అవకాశం కల్పించింది.

ఇండియా హౌస్‌లో ఎన్ఎస్ఏ గౌరవార్థం రాయబారి తరణ్‌జిత్ సంధు విందు ఏర్పాటు చేశారు. ఇందులో వాణిజ్య మంత్రి జినా రైమొండో, ఎన్ఎస్ఏ జేక్ సలివాన్, విదేశాంగ శాఖ తాత్కాలిక మంత్రి వెండీ షెర్మన్‌తో పాటు అమెరికా ప్రభుత్వంలోని పలువురు ఉన్నతాధికారులు, అధునాతన టెక్నాలజీ కంపెనీలు మరియు ఫండ్స్‌కి చెందిన సీఈవోలు, ప్రసిద్ధ అమెరికా యూనివర్సిటీల అధిపతులు పాల్గొన్నారు.

అధునాతన రంగాల్లో భారత్-అమెరికా సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రాతిపదికగా మరియు భారత్-అమెరికా మధ్య సమగ్ర, అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్య పరిపక్వతను ప్రతిబింబించేలా ఈ చర్చలు నిలిచాయి. నిర్దిష్ట కాలవ్యవధుల్లో ఫలితాలు రాబట్టే విధంగా ప్రయత్నాలపై దృష్టి పెట్టడం కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

**వాషింగ్టన్ డీసీ**

**జనవరి 31, 2023**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.